కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

BNS
BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ అఫ్ న్యూ భారత్

కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

సంపుటి - 01 సంచిక -147 తెలంగాణ ఆంధ్రప్రదేశ్ 09-06-2026 మంగళవారం పేజీలు : 4

# అధికారమే లక్ష్యం

## యాత్రలతో బీఆర్ఎస్ దూకుడు!

- కేసీఆర్ బస్సుయాత్రకు రంగం సిద్ధం
- కేటీఆర్ పాదయాత్రపై కసరత్తు
- ఎన్నికల సమరానికి బీఆర్ఎస్ సన్నద్ధం
- కాంగ్రెస్ వైఫల్యాలే ప్రధాన అస్త్రం
- ప్రజల్లోకి వెళ్లేందుకు భారీ ప్రణాళిక
- యువతపై గులాబీ పార్టీ ఫోకస్
- గ్రామస్థాయిలో పార్టీ బలోపేతం
- మరోసారి అధికారంపై గురి
- రాష్ట్రవ్యాప్త యాత్రలతో దూకుడు
- కేడర్‌కు కొత్త జోష్ నింపే యత్నం
- ప్రజా సమస్యలతో ప్రభుత్వంపై దాడి
- ఉద్యమాలతో వేడి పెంచనున్న బీఆర్ఎస్
- వచ్చే ఏడాది నుంచి మాస్ కనెక్ట్
- గెలుపే లక్ష్యంగా గులాబీ శిబిరం



**న్యూస్ డెస్క్, 08 జూన్ (బిఎన్ఎస్):** రాష్ట్రంలో రాజకీయ వేడి క్రమంగా పెరుగుతున్నది. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ రానున్న అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా ఇప్పటినుంచే కార్యాచరణ సిద్ధం చేసుకుంటున్నది. మరోసారి రాష్ట్రంలో అధికారమే లక్ష్యంగా ప్రజల్లోకి వెళ్లేందుకు ప్లాన్ చేస్తున్నది. అందులోభాగంగానే మాజీ సీఎం, బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వచ్చే ఏడాది నుంచి పూర్తిస్థాయిలో ప్రజల్లోకి వెళ్లేందుకు సన్నద్ధం అవుతున్నారు. ముఖ్యంగా కేసీఆర్ బస్సుయాత్ర, కేటీఆర్ పాదయాత్ర ద్వారా ప్రజల్లోకి వెళ్లేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అధికారాన్ని కోల్పోయిన తర్వాత బీఆర్ఎస్ సంస్థాగతంగా బలోపేతం కావడంపై దృష్టి సారించింది. ఓ వైపు సభ్యత్వ నమోదు, కేడర్ శిక్షణ, గ్రామస్థాయి కమిటీల పునర్వ్యవస్థీకరణ వంటి కార్యక్రమాలను చేపడుతున్నది. అదే సమయంలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఉద్యమ కార్యక్రమాలను కూడా ముమ్మరం చేస్తున్నది.

మిగతాది 2 లో..

## రాష్ట్రంలో మా ప్రభుత్వం వస్తే ఆదాయ పన్ను కడతాం


» సింగరేణి కార్మికులకు కిషన్ రెడ్డి బంపరాఫర్




**న్యూస్ డెస్క్, 08 జూన్ (బిఎన్ఎస్):** నూతన భారత నిర్మాణంలో బొగ్గు రంగం కీలక పాత్ర పోషిస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని ఫిల్మ్‌నగర్ ఎఫ్ఎన్‌సీసీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో కోల్ అంటే స్కామ్, అవినీతి, అనిశ్చితికి కేరాఫ్‌గా ఉండేదని కామెంట్ చేశారు. యూపీఏ సర్కార్ హయాంలో బొగ్గు గనుల మంత్రి జైలుకు వెళ్లారని గుర్తు చేశారు.

## టీఎంసీకి భారీ షాక్

### పార్టీకి, రాజ్యసభ సభ్యత్వానికి సుఖేందు శేఖర్ రాయ్ రాజీనామా




## సీఎం హిట్లర్ కన్నా ఎక్కువ

### అతడో తాలిబాన్: కల్వకుంట్ల కవిత ఫైర్




**న్యూస్ డెస్క్, 08 జూన్ (బిఎన్ఎస్):** సీఎం రేవంత్ రెడ్డి హిట్లర్ కన్నా ఎక్కువని.. తాలిబాన్‌తో సమానమని తెలంగాణ రక్షణ సమితి చీఫ్ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. రాష్ట్రంలో 27 వేల ప్రభుత్వ పాఠశాలలను 4 వేలకు కుదిస్తామన్న సీఎం వ్యాఖ్యలను తప్పుబడుతూ ఆమె సోషల్ మీడియా వేదికగా సోమవారం ఓ వీడియోను విడుదల చేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. ఆడపిల్లలు, నిరుపేదలను చదువులు దూరం చేసేందుకే ప్రభుత్వ స్కూళ్లు మూసేస్తామని సీఎం చెబుతున్నాడని ఫైర్ అయ్యారు.

## పైరవీలే ఫస్ట్.. ప్రజా సమస్యలు లాస్ట్!

### ఎమ్మెల్యేల తీరుపై సీఎం రేవంత్ ఫైర్?

న్యూస్ డెస్క్, 08 జూన్ (బిఎన్ఎస్): మెజార్టీ ఎమ్మెల్యేల వ్యవహారశైలీపై సీఎం రేవంత్ రెడ్డి గుర్రుగా ఉన్నట్టు తెలిసింది. నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారం కంటే, సొంత ప్రయోజనాల కోసమే ఎక్కువగా ఫోకస్ పెడుతున్నారని అభిప్రాయంలో ఆయన ఉన్నట్టు సమాచారం. తన వద్దకు వచ్చిన ప్రతీసారి ఏదో ఒక పైరవీ పేపరు ఇవ్వడం ఎమ్మెల్యేలకు పరిపాటిగా మారిందంటూ ఆయన కొందరు సన్నిహితుల వద్ద అసహనం వ్యక్తం చేస్తున్నట్టు తెలిసింది. రాజకీయాల్లో రాణించాలని తపన కంటే, అవకాశం ఉన్నప్పుడే వెనుకేసుకోవాలని తాపత్రయం మెజార్టీ ఎమ్మెల్యేల్లో ఉందని ఆయన కామెంట్ చేసినట్టు సమాచారం.

ఆర్థిక ప్రయోజనాలపైనే ఆరాటం..

సహజంగా ఎమ్మెల్యేలు సీఎంను కలిసినప్పుడు తమ నియోజకవర్గంలోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి, వాటిని పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తారు. అందుకు




సంబంధించిన వినతిపత్రాలు, ప్రపోజల్స్‌ను ఆయనకు ఇస్తుంటారు. కానీ కాంగ్రెస్ లోని మెజార్టీ ఎమ్మెల్యేలు నియోజకవర్గంలోని సమస్యల గురించి అసలు ప్రస్తావించటం లేదని తెలిసింది. సీఎంను కలిసిన ప్రతిసారి ఏదో ఒక పైరవీ చేయ్యాలంటూ, అందుకు సంబంధించిన పేపర్లు ఇవ్వడం రొటీన్ గా మారినట్టు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

## రాజ్యసభ, ఎమ్మెల్సీ అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ




# ఎల్ నినో పంజా

### హైదరాబాద్, ఢిల్లీ సహా పలు నగరాలకు పొంచి ఉన్న ముప్పు!





## స్థానిక ఎన్నికలపై సీఎం చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు

**న్యూస్ డెస్క్, 08 జూన్ (బిఎన్ఎస్):** ఆంధ్రప్రదేశ్‌లో మరో మూడు నెలల్లో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులన్నీ సర్వసన్నద్ధం కావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్న వేళ, రాబోయే స్థానిక పోరును ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. అమరావతిలో జరిగిన తాజా సమీక్షా సమావేశంలో పార్టీ భవిష్యత్తు కార్యాచరణ, నియోజకవర్గాల వారీగా బాధ్యతలపై ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు.

తన సొంత నియోజకవర్గమైన కుప్పంపై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారు. ఇకపై కుప్పంలో జరిగే అన్ని కార్యక్రమాలను తానే స్వయంగా పర్యవేక్షిస్తానని ప్రకటించారు. ఇందుకోసం ప్రతి రెండు నెలలకు ఒకసారి కుప్పం నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు వెల్లడించారు. అలాగే, కుప్పం నియోజకవర్గ కన్వీనర్ శ్రీకాంత్ సేవలను ఇకపై రాష్ట్ర స్థాయి అవసరాలకు, పార్టీ బలోపేతానికి వినియోగించుకోనున్నట్లు పేర్కొన్నారు.

నామినేటెడ్ పోస్టులు దక్కించుకున్న నాయకులకు సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు జారీ చేశారు. పదవుల్లో ఉన్నవారు కేవలం తమకు కేటాయించిన సంబంధిత శాఖల బాధ్యతలను మాత్రమే చూసుకోవాలని, క్షేత్రస్థాయిలో పార్టీ లైన్‌కు లోబడి పనిచేయాలని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయం సాధించడమే లక్ష్యంగా నాయకులంతా సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.



# ఎల్ నినో పంజా.. హైదరాబాద్, ఢిల్లీ సహా పలు నగరాలకు పొంచి ఉన్న ముప్పు!

**న్యూస్ డెస్క్, 08 జూన్ (బిఎన్ఎస్):** నైరుతి రుతుపవనాలు కేరళం తీరాన్ని దాటడంతో వేసవి ముగిసి వర్షాకాలం మొదలైందని సంతోషిస్తున్న ప్రజలకు అంతర్జాతీయ వాతావరణ సంస్థ చేసిన ప్రకటన షాక్?కు గురి చేస్తోంది. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా పలు నగరాలు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కోబోతున్నాయని హెచ్చరించింది. రాబోయే కొన్ని నెలలు గడ్డుపరిస్థితి తప్పేలా లేదని అప్రమత్తం చేసింది. ప్రకృతిలో వస్తున్న ఆకస్మిక మార్పులు పసిఫిక్ మహాసముద్రంలో సంభవిస్తున్న అసాధారణ మార్పుల వల్ల ఎల్ నినో పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఈ కారణంగా రాబోయే రోజుల్లో ప్రపంచ వ్యాప్తంగా వాతావరణంలో సమతుల్యత దెబ్బతినబోతోందని అంతర్జాతీయ వాతావరణ సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. దీని ప్రభావంతో ఒకే సమయంలో భూమిపై కొన్ని ప్రాంతాలు తీవ్రమైన నీటి ఎద్దడిని ఎదుర్కొంటే, మరికొన్ని ప్రాంతాలను భారీ వర్షాలు ముంచెత్తే అవకాశం ఉంది.

ఏంటీ ఎల్ నినో?:

ప్రపంచ వాతావరణ గమనంలో పసిఫిక్ మహాసముద్రం పాత్ర చాలా కీలకమైంది. ప్రస్తుతం ఈ మహాసముద్రంలోని మధ్య, తూర్పు ఉపరితల భాగాలలో నీరు అసాధారణంగా వేడెక్కుతోంది. గత కొన్ని దశాబ్దాలతో పోలిస్తే ఈ టెంపరేచర్ పెరుగుదల రికార్డు స్థాయికి చేరుకుంది. వాతావరణంలో ఈ మార్పులను శాస్త్రవేత్తలు ఎల్ నినో లేదా ఎన్సో ఉష్ణదశగా పిలుస్తారు. సముద్ర ఉపరీతల వేడి పెరిగిపోవడం వల్ల వర్షాన్ని మోసుకెళ్లే గాలుల దిశ మారిపోతుంది. దీంతో కొన్ని ప్రాంతాల నుంచి మేఘాలు పూర్తిగా దూరమైపోతే, మరికొన్ని ప్రాంతాలపై కేంద్రీకృతమై భారీ వర్షాలు కురుస్తాయి. వాతావరణ సంస్థల ప్రకారం పసిఫిక్ మహాసముద్రంలో ఉన్న జలాల ఉష్ణోగ్రతలు 0.5 డిగ్రీల సెల్సియస్ దాటితే అది రుతుపవనాలపై ప్రభావం చూపుతుంది. అయితే ఈ ఏడాది జూన్ నుంచి ఆగస్టు మధ్య ఇది ఏకంగా 1.8 డిగ్రీల సెల్సియస్ వరకు చేరుకునే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. దీంతో రుతుపవనాలు ఆధారిత వర్షాలపై తీవ్ర ప్రభావం పడనుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

హైదరాబాద్ సహా ప్రముఖ నగరాలపై ఎఫెక్ట్:

ఈ ఎల్ నినో ప్రభావం భారతదేశంలోని ప్రధాన నగరాలపై తీవ్రంగా ఉండబోతోందని నివేదికలు హెచ్చరిస్తున్నాయి. భారత వాతావరణ శాఖ సమాచారం ప్రకారం ఈ సంవత్సరం దేశంలో కేవలం 90 శాతం మాత్రమే రుతుపవన వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా హైదరాబాద్?తో పాటు ఢిల్లీ, ముంబయి, బెంగళూరు వంటి మహానగరాల్లో వర్షాలు ముఖం చాటేయనున్నాయి. దీంతో ఇక్కడ వర్షాలు లేక నీటి సమస్య ఉత్పన్నం అయ్యే ప్రమాదం ఉందని, కేవలం ఈశాన్య భారత ప్రాంతాలు మాత్రమే ఈ ముప్పు నుంచి కొంతవరకు తప్పించుకోగలవని అంచనా వేస్తున్నారు. మన దేశంలో ఖరీఫ్ సీజన్ పంటలు పూర్తిగా ఈ నైరుతి రుతుపవన వర్షాలపైనే ఆధారపడి ఉంటాయి. ఒకవేళ ఎల్ నినో కారణంగా వర్షాలు బలహీనపడితే అది పంటల సాగుపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుంది. నదీజలాలు కూడా తగ్గి నీటి అవసరాలకు ఇబ్బందులు ఏర్పడే ప్రమాదం ఉంది.

# రాష్ట్రంలో మా ప్రభుత్వం వస్తే ఆదాయ పన్ను కడతాం సింగరేణి కార్మికులకు కిషన్ రెడ్డి బంపరాఫర్



**న్యూస్ డెస్క్, 08 జూన్ (బిఎన్ఎస్):** నూతన భారత నిర్మాణంలో బొగ్గు రంగం కీలక పాత్ర పోషిస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని ఫిల్మ్‌నగర్ ఎఫ్ఎన్‌సీసీ లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో కోల్ అంటే స్కామ్, అవినీతి, అనిశ్చితికి కేరాఫ్‌గా ఉండేదని కామెంట్ చేశారు. యూపీఏ సర్కార్ హయాంలో బొగ్గు గనుల మంత్రి జైలుకు వెళ్లారని గుర్తు చేశారు. రూ.1.86 లక్షల కోట్ల బొగ్గు స్కామ్ జరిగిందని కాగ్ అప్పట్లో నివేదిక ఇచ్చిందని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో కేటాయించిన కోల్ మైన్స్‌ను కూడా సుప్రీంకోర్టు రద్దు చేసిందని అన్నారు.

కానీ, గత 12 ఏళ్లలో అవినీతి అనేదే లేకుండా చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రస్తుతం దేశంలో 189 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని అన్నారు. అండర్ గ్రౌండ్ కోల్ గ్యాసిఫికేషన్ పై అధ్యయనం చేస్తున్నామని, కోల్ గ్యాసిఫికేషన్‌పై 11న ప్రైవేటు కంపెనీలతో చర్చిస్తామని వెల్లడించారు. 2028 నాటికి దేశంలో అన్ని కోల్ బ్లాక్‌లను మూసేస్తామని స్పష్టం చేశారు. క్రిటికల్ మినరల్స్ మిషన్ ప్రోగ్రామ్‌కు రూ.1,500 కోట్లు మంజూరు చేశామని, ఇప్పటి వరకు 24 క్రిటికల్ మినరల్స్‌ను దిగుమతి చేసుకుంటున్నామని అన్నారు. అర్జెంటీనాలో 6 క్రిటికల్ మినరల్స్ బ్లాక్స్ తీసుకున్నామని పేర్కొన్నారు. ఒకవేళ తెలంగాణ రాష్ట్రంలో తమ ప్రభుత్వం వస్తే.. సింగరేణి కార్మికుల ఆదాయ పన్నును కూడా ప్రభుత్వమే చెల్లిస్తుందని బంపరాఫర్ ఇచ్చారు.

# పైరవీలే ఫస్ట్.. ప్రజా సమస్యలు లాస్ట్! ఎమ్మెల్యేల తీరుపై సీఎం రేవంత్ ఫైర్?

మొదటి పేజీ తరువాయి



కొందరు ఎమ్మెల్యేలు ప్రధానంగా భూ వివాదాలపైనే ఎక్కువగా ఫోకస్ పెట్టి, అందుకు సంబంధించిన పేపర్లను తీసుకుని సీఎం వద్దకు వెళ్తున్నారని ఫిర్యాదులు ఉన్నాయి. అందుకోసం పదే పదే సీఎంను కలిసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు చర్చ జరుగుతున్నది. కొందరు ఎమ్మెల్యేలు తమకు సన్నిహితులైన అధికారులకు పోస్టింగ్ ఇవ్వాలని ఒత్తిడి పెంచే ప్రయత్నాలు చేస్తుంటారని టాక్ ఉంది. సదరు అధికారుల ట్రాక్ రికార్డు సరిగా లేకున్నా అదే పనిగా పోస్టింగ్ కోసం లాబీయింగ్ చేస్తున్నారని ప్రచారం ఉంది. ఇంకొందరు ఎమ్మెల్యేలు ఏసీబీ కేసుల్లో ఇరుక్కున అధికారులపై చార్జెస్ లేకుండా చూడాలని సీఎంకు అప్పీలు చేస్తున్నట్టు తెలిసింది.

కలిస్తే ఓ సమస్య.. కలకపోతే మరో సమస్య..

అధికారంలోకి వచ్చిన కొత్తలో పని ఒత్తిడి కారణంగా సీఎం రేవంత్ రెడ్డి ఎమ్మెల్యేలను రెగ్యులర్ గా కలిసేవారు కాదు. దీనితో ఎమ్మెల్యేలు తమకు టైమ్ ఇవ్వకపోతే ఎట్లా ? నియోజకవర్గంలోని సమస్యలను ఎవరికి చెప్పుకోవాలి ? అంటూ అవేదన చెందేవారు. దీనితో ప్రతిరోజు ఎమ్మెల్యేలను కలిసేందుకు రేవంత్ రెడ్డి షెడ్యూలు ఫిక్స్ చేసుకుని, ఆ సమయంలో తన వద్దకు వచ్చిన ప్రతి ఒక్క శాసనసభ్యుడిని విడివిడిగా కలుస్తున్నారు. ఆ టైమ్ లో మెజార్టీ మంది ఎమ్మెల్యేలు నియోజకవర్గంలోని సమస్యలు చెప్పట్లేదని అసహనం వ్యక్తం చేస్తున్నట్టు తెలిసింది. 'నియోజకర్గంలోని సమస్యలు చెప్తే వెంటనే సంబంధిత అధికారులకు చెప్పి పరిష్కారం చూపొచ్చు. కానీ పైరవీల కోసమే వస్తున్నారు.. వచ్చిన ప్రతీసారి ఏదో ఒక కాగితం తెస్తరు..ఆ పని చెయ్యమని, ఈ పనిచెయ్యమని అడుగుతున్నరు'అంటూ ఆయన ఎమ్మెల్యేల ప్రవర్తన పట్ల తన సన్నిహితుల వద్ద కామెంట్ చేసినట్టు తెలిసింది. ఎమ్మెల్యేల పైరవీలను తప్పించుకునేందుకు అపాయింట్మెంట్ ఇవ్వకపోతే సీఎం కలుస్తలేరని ప్రచారం చేస్తారేమోనని అనుమానంలో ఆయన ఉన్నట్టు సమాచారం.

మళ్లీ గెలవాలనే తపన కరువు..

కొత్తగా ఎన్నికైన మెజార్టీ ఎమ్మెల్యేల్లో రాజకీయాల్లో కొనసాగాలనే తపన కనిపించడం లేదని విమర్శలు ఉన్నాయి. మళ్లీ గెలవాలని టార్గెట్ ఉన్న నాయకులు నిత్యం నియోజకవర్గంలో అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించడంపై ఫోకస్ పెడుతుంటారు. కానీ కాంగ్రెస్ లోని మెజార్టీ ఎమ్మెల్యేలు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు తాపత్రయపడుతున్నట్టు ప్రచారం ఉంది. అందుకోసం నియోజకవర్గంలోని భూ వివాదాల్లో జోక్యం చేసుకోవడం, రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు, బిల్డర్లతో చేతులు కలపడం, అధికారులపై అజమాయిషీ చెలాయిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.

# "అధికారమే లక్ష్యం.. యాత్రలతో బీఆర్ఎస్ దూకుడు!"

మొదటి పేజీ తరువాయి



కాంగ్రెస్ వైఫల్యాలే లక్ష్యంగా..

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టి రెండున్నరేళ్లు గడిచిపోయింది. ఈ క్రమంలో ఇప్పటివరకు పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను చాలావరకు అమలు చేయలేదని బీఆర్ఎస్ ఆరోపిస్తూ వస్తున్నది. అయితే.. వాటినే లక్ష్యంగా చేసుకొని బీఆర్ఎస్ ప్రజల్లోకి వెళ్లేందుకు సమాయత్తం అవుతున్నది. ఎన్నికల హామీల అమలులో వైఫల్యం, ప్రజాసమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యంపై ప్రజలకు వివరించాలని భావిస్తున్నారు. అంతేకాకుండా.. ఈ ప్రభుత్వంలో బయటపడిన అవినీతి, అక్రమాలను సైతం ప్రధాన అస్త్రాలుగా మలుచుకోవాలని పార్టీ నిర్ణయించింది. మరోవైపు.. క్షేత్రస్థాయిలో రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు, వివిధ రంగాలకు చెందిన కార్మికుల మద్దతు సైతం కూడగట్టేలా పార్టీ కేడర్‌ను సిద్ధం చేస్తున్నారు. ఇదిలా ఉంటే.. పార్టీ సభ్యత్వ నమోదులో, త్వరలో ప్రకటించే కార్యవర్గాల్లోనూ యూత్‌కు పెద్దపీట వేయాలని పార్టీ భావిస్తున్నది. యూత్ తలచుకుంటే ఏదైనా సాధ్యమనే అభిప్రాయానికి వచ్చిన బీఆర్ఎస్.. పార్టీలో తదుపరి టికెట్ల కేటాయింపులోనూ వారికే ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. అందుకే.. వచ్చే ఏడాదే కేసీఆర్ బస్సుయాత్రతోపాటే కేటీఆర్ పాదయాత్ర వంటి భారీ ప్రజా కార్యక్రమాలతో దూకుడు పెంచేందుకు బీఆర్ఎస్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నది.


విద్యార్థి, యువజన నేతలతో భేటీ..

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందనే అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు ఇప్పటికే వరంగల్‌లో రైతు సదస్సు నిర్వహించింది. త్వరలోనే తెలంగాణ భవన్‌లో యువజన, విద్యార్థి నేతలతో సమావేశం నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. కేటీఆర్, హరీశ్‌రావుతోపాటు పార్టీ ముఖ్య నేతలు రేవంత్ ప్రభుత్వంపై రోజుకో ఆరోపణ, విమర్శలతో విరుచుకుపడుతున్నారు. ఇదే ఒరవడిని కొనసాగిస్తూ ఇప్పటికే అసెంబ్లీతోపాటు ప్రజా వేదికలు, సామాజిక మాధ్యమాలు, జిల్లాస్థాయిలో కార్యక్రమాల ద్వారా ఈ అంశాలను ప్రజల్లోకి నిరంతరం తీసుకెళ్లాలని బీఆర్ఎస్ భావిస్తున్నది. మరోవైపు.. గ్రేటర్ పరిధిలో కొత్తగా ఏర్పాటైన మూడు కార్పొరేషన్లలో నెలకొన్న రాజకీయ పరిణామాలపై పార్టీ ప్రధానంగా ఫోకస్ పెట్టింది. అటు 'సర్' పైనా కేటీఆర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

బస్సుయాత్రకు సన్నాహాలు..?

తెలంగాణ ఉద్యమ కాలంలోనూ, రాష్ట్ర ఆవిర్భావం తర్వాత కూడా ప్రజల మధ్య విస్తృతంగా పర్యటించిన కేసీఆర్.. మళ్లీ రాష్ట్రవ్యాప్తంగా బస్సుయాత్ర చేపట్టాలని భావిస్తున్నారు. రైతులు, మహిళలు, యువత, ఉద్యోగులు, వివిధ వర్గాల సమస్యలను నేరుగా తెలుసుకుంటూ ప్రభుత్వ విధానాలపై ప్రజల్లో అవగాహన కల్పించేలా ఈ యాత్ర చేపట్టేందుకు సంసిద్ధం అవుతున్నారు. ప్రతి జిల్లాలో ముఖ్య సమావేశాలు, ప్రజాప్రతినిధులతో భేటీలు, కార్యకర్తల సమావేశాలు నిర్వహించేలా యాత్రను రూపొందించే అవకాశం ఉన్నదని పార్టీ నాయకులు చెబుతున్నారు. ముఖ్యంగా బీఆర్ఎస్ బలహీనపడిన ప్రాంతాల్లో పార్టీ శ్రేణులకు కొత్త ఉత్సాహం నింపడమే యాత్ర ప్రధాన ఉద్దేశంగా ఉండవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేపట్టే అవకాశాలపైనా చర్చ నడుస్తున్నది. యువత, నిరుద్యోగులు, రైతులు, పట్టణ మధ్యతరగతి వర్గాలతో నేరుగా మమేకం కావడానికి పాదయాత్ర ఉత్తమ మార్గమనే అభిప్రాయం పార్టీ నాయకత్వంలో ఉన్నట్లు తెలుస్తోంది. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ అధికారంలోకి రావడమే బీఆర్ఎస్ ప్రధాన లక్ష్యంగా కనిపిస్తున్నది. ఇందుకోసం పార్టీ ఒకవైపు సంస్థాగత బలోపేతంపై దృష్టి పెట్టగా, మరోవైపు ప్రజా ఉద్యమాలు, రాష్ట్రవ్యాప్త యాత్రల ద్వారా ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలను పెంచుకోవాలని భావిస్తున్నది.

# టీఎంసీకి భారీ షాక్.. పార్టీకి, రాజ్యసభ సభ్యత్వానికి సుఖేందు శేఖర్ రాయ్ రాజీనామా



**న్యూస్ డెస్క్, 08 జూన్ (బిఎన్ఎస్):** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర ఓటమి తర్వాత టీఎంసీ పార్టీ కి భారీ షాక్‌లు తగులుతున్నాయి. ఇప్పటికే ఆ పార్టీలో చీలికలు రాగా.. తాజాగా మరో ఊహించని షాక్ తగిలింది. టీఎంసీ సీనియర్ నేత, రాజ్యసభ ఎంపీ సుఖేందు శేఖర్ రాయ్ పార్టీకి గుడ్‌బై చెప్పారు. సోమవారం ఉదయం.. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేయడంతో పాటు తన రాజ్యసభ ఎంపీ పదవికి కూడా ఆయన రాజీనామా సమర్పించారు. గత కొన్ని రోజులుగా టీఎంసీ పార్టీ అంతర్గత వ్యవహారాలు, పనితీరుపై సుఖేందు శేఖర్ రాయ్ తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. పార్టీలో నాయకులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడానికి సరైన అవకాశం లేకుండా పోయిందని, తాము పార్టీలో సంతోషంగా లేమని ఆయన వ్యాఖ్యానించారు.

2011 నుండి టీఎంసీ తరపున రాజ్యసభలో ప్రాతినిధ్యం వహిస్తున్న సుఖేందు శేఖర్ రాయ్ రాజీనామా మమతా బెనర్జీ నేతృత్వంలోని పార్టీకి జాతీయ స్థాయిలో పెద్ద షాక్ అని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. గత కొంత కాలంగా శారీరకంగా పార్టీలో ఉన్నప్పటికీ, మానసికంగా ఎప్పుడో దూరమయ్యానని ఇటీవలే ఆయన స్పష్టం చేశారు. ఇదిలా ఉంటే బెంగాల్ రాజకీయాలో మంచి అనుభవం ఉన్న సుఖేందు శేఖర్ రాయ్ తదుపరి రాజకీయ అడుగులు ఎటువైపు ఉంటాయనే దానిపై ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

# రాజ్యసభ, ఎమ్మెల్సీ అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ



**న్యూస్ డెస్క్, 08 జూన్ (బిఎన్ఎస్):** దేశవ్యాప్తంగా జరగనున్న రాజ్యసభ, ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి భారతీయ జనతా పార్టీ తమ అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. కర్ణాటక, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి రాజ్యసభ స్థానాలకు, అలాగే కర్ణాటక శాసనమండలి ఎన్నికల్లో పోటీ చేయబోయే అభ్యర్థుల పేర్లను పార్టీ అధిష్టానం ఖరారు చేసింది. సామాజిక సమీకరణాలు, పార్టీ పట్ల నిబద్ధతను పరిగణనలోకి తీసుకుంటూ అగ్రనాయకత్వం ఈ ఎంపికలు జరిపినట్లు తెలుస్తోంది. కర్ణాటక నుంచి ఖాళీ అవుతున్న రాజ్యసభ స్థానాల భర్తీకి గాను క్షేత్రస్థాయిలో బలమైన పట్టున్న ముగ్గురు కీలక నేతలను బీజేపీ బరిలోకి దించింది. అలాగే మధ్యప్రదేశ్ రాష్ట్ర కోటా కింద జరగనున్న రాజ్యసభ ఎన్నికల కోసం ఇద్దరు సీనియర్ నాయకుల పేర్లను కేంద్ర ఎన్నికల కమిటీ ఖరారు చేసింది. రాజ్యసభ తో పాటు కర్ణాటక శాసనమండలికి జరగనున్న ద్వైవార్షిక ఎన్నికల అభ్యర్థుల జాబితాను కూడా బీజేపీ విడుదల చేసింది. పార్టీ కోసం సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న సీనియర్ కార్యకర్తలకు, వివిధ సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పిస్తూ ఈ ఎమ్మెల్సీ అభ్యర్థులను ఎంపిక చేశారు. రాబోయే ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులను సమాయత్తం చేస్తున్నారు.

మధ్యప్రదేశ్ రాష్ట్రం నుంచి రాజ్యసభ అభ్యర్థిగా మహేష్ కేవట్ పేరును బీజేపీ ప్రకటించింది. అలాగే కర్ణాటక నుంచి రాజ్యసభ స్థానానికి ప్రొఫెసర్ (డాక్టర్) ఎం. నాగరాజ్ ను బరిలోకి దించింది. కర్ణాటక శాసనమండలి ఎన్నికల కోసం ఇద్దరు అభ్యర్థులకు బీజేపీ అధిష్టానం ఆమోదం తెలిపింది. లింగరాజ్ పాటిల్ రఘు కౌటిల్య ఎమ్మెల్సీగా పోటీలో నిలవనున్నారు.

# సీఎం హిట్లర్ కన్నా ఎక్కువ

## అతడో తాలిబాన్: టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత ఫైర్

మొదటి పేజీ తరువాయి



విద్యాశాఖను సర్కస్ లెక్క మార్చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 27 వేల ప్రభుత్వ స్కూళ్లను మూసేసి 4 వేల పాఠశాలలు మాత్రమే నడిపిస్తానని అంటున్న రేవంత్ రెడ్డి హిట్లర్ మాత్రమే కాదు.. ఆయనో తాలిబాన్ అంటూ సెటైర్లు వేశారు.

ఈ ఏడాది ఇంటర్మీడియట్ ఉండదని సీఎం ప్రకటించిన మరుసటి రోజే అడ్మిషన్లకు ఇంటర్ బోర్డు అడ్మిషన్లు ఇచ్చిందని కవిత అన్నారు. జూనియర్ కాలేజీలు ప్రారంభమైన వారం గడుస్తున్నా.. ప్రభుత్వ, ప్రవేటు జూనియర్ కాలేజీలకు ఈ సర్కార్ కనీసం అఫిలియేషన్‌లు ఇవ్వలేదని తెలిపారు. డిగ్రీ అడ్మిషన్లను గందరగోళంగా మార్చేశారని, హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ కొన్ని కోర్సులను సిఫార్సు చేస్తే.. కమిషనరేట్ మాత్రం మరికొన్ని కోర్సులు రిఫర్ చేసిందన్నారు. అందులో ఏ ఒక్క కోర్సుకు కూడా యూనివర్సిటీలు అప్రూవల్ ఇవ్వలేదని, అయినా దోస్త్ అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. గురుకులాల్లో వంద మందికి పైగా విద్యార్థులు చనిపోయినా సీఎం కనీస సమీక్ష చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.11 వేల కోట్ల ఫీ రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా విద్యార్థులకే ట్యూషన్ ఫీజులు ఇస్తామని చెప్పి జీవో నెంబర్ 7 తీసుకువచ్చారని.. దీంతో విద్యార్థులను ప్రైవేటు కాలేజీలు దోపిడీ చేసే ప్రమాదం ఉందని అన్నారు. అందుకే వెంటనే జీవో నెంబర్ 7ను రద్దు చేసి.. ఫీజుల నియంత్రణ చట్టాన్ని వెంటనే అమల్లోకి ప్రైవేటు స్కూళ్ల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు.

# స్థానిక ఎన్నికలపై సీఎం చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి



మరోవైపు.. తెలుగుదేశం పార్టీ తరపున రాజ్యసభ అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియ రేపు ముగియనుంది. టీడీపీ ప్రకటించిన ముగ్గురు అభ్యర్థులు సానా సతీష్, భాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్.. నేడు ఉదయం 11 గంటలకు తమ నామినేషన్లను అధికారికంగా దాఖలు చేయనున్నారు. నేడు మధ్యాహ్నం 3 గంటలతో రాజ్యసభ అభ్యర్థుల నామినేషన్ల గడువు ముగియనుండటంతో, పార్టీ ముఖ్యనేతల సమక్షంలో ఈ ప్రక్రియ పూర్తి కానుంది. ఒకవైపు స్థానిక ఎన్నికల సమరశంఖం, మరోవైపు రాజ్యసభ స్థానాల భర్తీతో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో రాజకీయంగా మరింత దూకుడు పెంచింది.

# ధవళేశ్వరం బ్యారేజీకి కొత్తరూపు

## 46 ఏళ్ల తర్వాత ఆధునికీకరణ పనులకు శ్రీకారం!



**న్యూస్ డెస్క్, 08 జూన్ (బిఎన్ఎస్):** గోదావరి నదిపై బ్రిటిష్ ఇంజినీర్ సర్ ఆర్థర్ కాటన్ నిర్మించిన చారిత్రాత్మక ధవళేశ్వరం బ్యారేజీకి రాష్ట్ర ప్రభుత్వం భారీ స్థాయిలో ఆధునికీకరణ చేపట్టేందుకు సిద్ధమైంది. దాదాపు 46 ఏళ్ల తర్వాత ఈ బ్యారేజీకి పూర్తి స్థాయి పునరుద్ధరణ పనులు జరగనున్నాయి. గోదావరి డెల్టా ప్రాంతానికి జీవనాడిగా నిలిచిన ఈ బ్యారేజీ భద్రత, నీటి నిర్వహణ సామర్థ్యాన్ని మరింత మెరుగుపరచడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పేర్కొంది.

ధవళేశ్వరం బ్యారేజీలో చివరిసారిగా 1980లో ప్రధాన మార్పులు చేపట్టారు. ఆ తర్వాత కాలక్రమేణా బ్యారేజీలోని పలు భాగాలు దెబ్బతినడంతో పాటు గేట్లపై తుప్పు ప్రభావం కూడా పెరిగింది. డ్యాం భద్రతా నిపుణులు పలుమార్లు బ్యారేజీ పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేస్తూ నివేదికలు సమర్పించినప్పటికీ.. గతంలో పునరుద్ధరణ పనులు ముందుకు సాగలేదు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఈ కీలక ప్రాజెక్టును చేపట్టాలని నిర్ణయించింది. సుమారు రూ.150 కోట్ల అంచనా వ్యయంతో టెండర్లు ఆహ్వానించగా.. బెకం సంస్థ రూ.124.34 కోట్లకు దక్కించుకుంది. పనులు ప్రారంభించేందుకు అధికారులు ఇప్పటికే సన్నాహాలు చేస్తున్నారు.

ఆధునికీకరణలో భాగంగా ప్రస్తుతం తుప్పు పట్టి బలహీనంగా మారిన 117 గేట్లను తొలగించి.. వాటి స్థానంలో అత్యాధునిక సాంకేతికతతో రూపొందించిన కొత్త గేట్లను ఏర్పాటు చేయనున్నారు. దీంతో బ్యారేజీ నీటి నిల్వ, విడుదల వ్యవస్థ మరింత సమర్థవంతంగా పనిచేసే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. పనులు పూర్తయిన అనంతరం ధవళేశ్వరం బ్యారేజీ భద్రత గణనీయంగా మెరుగుపడటంతో పాటు, గోదావరి డెల్టా ప్రాంతంలోని లక్షలాది ఎకరాలకు సాగునీటి సరఫరా మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చని అధికారులు భావిస్తున్నారు. చారిత్రాత్మక ప్రాధాన్యత కలిగిన ధవళేశ్వరం బ్యారేజీ ఆధునికీకరణతో గోదావరి డెల్టా వ్యవసాయ రంగానికి కొత్త ఊపిరి లభించనుండగా.. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నీటి వనరుల నిర్వహణలో కూడా ఇది కీలక మైలురాయిగా నిలవనుంది.

# నేడు వెంకటగిరిలో వెన్నుపోటుకి రెండేళ్లు కార్యక్రమం



ఉమ్మడి నెల్లూరు జిల్లా వెంకటగిరి(బిఎన్ఎస్):– ఉమ్మడి నెల్లూరు జిల్లా వెంకటగిరి పట్టణంలోని స్థానిక యన్.జె. ఆర్. బంగ్లాలో వైస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు "వెన్నుపోటుకి రెండేళ్లు" కార్యక్రమం వైస్సార్ కాంగ్రెస్ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ ఇంచార్జి నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు అని వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని వెంకటగిరి పట్టణం, వెంకటగిరి రూరల్, రాపూరు, బాలయపల్లి, సైదాపురం, డక్కిలి, కలువాయి మండలాల వైస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని వెంకటగిరి నేదురుమల్లి కార్యాలయం నుండి ప్రకటనలో తెలిపారు.

# నెల్లిమర్ల లో ఎమ్మెల్యే మాధవి పర్యటన




బిఎన్ఎస్: నెల్లిమర్ల నగరపంచాయతీ పరిధిలోని4వ వార్డులో ఉన్న టీచర్స్ కాలనీ మొండివీధి ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే మాధవి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న రహదారులు, మురుగునీటి పారుదల సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించే దిశగా ఈ అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నెల్లిమర్ల పట్టణం మరియు గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా అమలవుతున్నాయని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని పనులు చేపడతామని హామీ ఇచ్చారు.

# జిల్లా ప్రజాపరిషత్ చైర్మన్ ని కలిసిన రాపూరు యంపీడిఓ





నెల్లూరు జిల్లా రాపూరు(బిఎన్ఎస్):– నెల్లూరు జిల్లా రాపూరు యంపీడిఓ గా ఆదివారం నూతనంగా బాధ్యతలు చేపట్టిన పి.వసుందరమ్మ సోమవారం ఉదయం నెల్లూరు జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ ఆనం అరుణమ్మని ఆమె ఛాంబర్ నందు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు.

# భార్యభర్తల ఆత్మహత్య

## అనాథైన నాలుగేళ్ల కుమారుడు

## రామాటాకీస్ శ్రీనగర్ లో విషాదం

విశాఖపట్నం, బిఎన్ఎస్ న్యూస్ జూన్ 8: నగర నడిబొడ్డున రామా టాకీస్ వద్ద గల శ్రీనగర్ ప్రాంతంలో భార్యభర్తలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సంచలనం సృష్టించింది. ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలోని



రామాటాకీస్ వెనుక శ్రీనగర్ ప్రాంతంలో ఉన్న ఓ భవనంలో ఆదివారం అర్ధరాత్రి ఈ విషాద ఘటన చోటు చేసుకుంది. శ్రీకాకుళం జిల్లా కళింగపట్నం ప్రాంతానికి చెందిన బలరాం (33), ప్రియాంక (27) అనే దంపతులు బ్రతుకుతెరువు కోసం విశాఖ నగరానికి వచ్చారు. వీరిది ప్రేమ వివాహం కాగా, వీరికి నాలుగేళ్ల కుమారుడున్నాడు. ఈ కుటుంబానికి తోడుగా ప్రియాంక తల్లి కూడా ఆ ఇంట్లోనే ఉంటోంది. బలరాం వెల్డింగ్ పనులు చేసుకుంటూ మద్యానికి బానిసయ్యాడు. ఇటీవల బలరాం మద్యం సేవించి తనను వేధిస్తున్నట్టు ప్రియాంక పలుమార్లు పోలీసులకు ఫిర్యాదిచ్చింది. ఇదిలా ఉంటే ఆదివారం రాత్రి 10గంటల సమయంలో తనకు బిర్యానీ కావాలని బలరాం ఒత్తిడి చేయడంతో తెచ్చేందుకు ప్రియాంక తల్లి బయటకు వెళ్లింది. ఈ లోగా ఏమైందో ఏమోగానీ వీరిద్దరూ విగతజీవులుగా కనిపించారు. భార్యభర్తల సమీపంలోనే కొడుకు ఏడుస్తూ కనిపించడంతో ప్రియాంక తల్లి కంగారుపడి పొరుగుంటివాళ్లను పిలిచి పోలీసులకు సమాచారమిచ్చింది. ఈ సమాచారం అందుకున్న నైట్ రౌండ్స్ క్రైం ఎస్ ఐ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు ఆరా తీశారు. తొలుత ప్రియాంకకు ఉరి వేసి, ఆమె చనిపోయిందని నిర్ధారించుకున్నాక బలరాం ఉరి వేసుకున్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ దంపతులు

కడు పేదరికంలో ఉన్నట్టు తెలుస్తోంది. వీరి ఆత్మహత్యకు మరేమైనా కారణాలున్నాయా అని పోలీసులు ఆరా తీస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాల్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్ మార్చురీకి తరలించారు. తల్లిదండ్రుల ఆత్మహత్యతో వారి నాలుగేళ్ల కుమారుడు అనాథైపోయాడని ప్రియాంక తల్లి రోధిస్తోంది.

# ఖేత్ బచావో అభియాన్‌లో రైతులకు అవగాహన

## 90 శాతం సబ్సిడీపై వరి విత్తనాల పంపిణీ.

చింతపల్లి బిఎన్ఎస్ న్యూస్:– చింతపల్లి మండలం అంతర్ల గ్రామంలో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం (ఆర్ఏఆర్ఎస్), చింతపల్లి శాస్త్రవేత్త (పంట శరీర ధర్మశాస్త్రం) డా. డి. వెంకటేష్‌బాబు, మండల వ్యవసాయ అధికారి (ఎంఏఓ) మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా డా. వెంకటేష్‌బాబు రైతులకు నేల ఆరోగ్య పరిరక్షణ, సమతుల్య ఎరువుల వినియోగం, నేల పరీక్షల ప్రాముఖ్యత, పచ్చి ఎరువుల వాడకం, నీటి సంరక్షణ, సహజ వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. అధిక రసాయన ఎరువుల వినియోగం వల్ల నేల సారవంతత తగ్గిపోతుందని, నేల పరీక్షల ఆధారంగా ఎరువులు వినియోగించడం ద్వారా దిగుబడులు పెరగడంతో పాటు సాగు వ్యయాలు కూడా తగ్గుతాయని వివరించారు.

ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం దేశవ్యాప్తంగా నేల ఆరోగ్య పరిరక్షణ, సమతుల్య ఎరువుల వినియోగం, స్థిరమైన వ్యవసాయ విధానాల ప్రోత్సాహం కోసం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ వ్యవసాయం వైపు అడుగులు వేయాలని సూచించారు.



అనంతరం రైతులకు 90 శాతం సబ్సిడీతో నాణ్యమైన వరి విత్తనాలను పంపిణీ చేశారు. విత్తనాల ఎంపికలో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని, నాసిరకం లేదా అనుకూలం కాని విత్తనాలను వినియోగిస్తే మొత్తం సీజన్‌లో నష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందని అధికారులు హెచ్చరించారు. హైబ్రిడ్ విత్తనాల ఎంపికలో కూడా రైతులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

కార్యక్రమంలో ఎంపీడీవో సీతామాలక్ష్మి, టీడీపీ మండల అధ్యక్షుడు పూర్ణచంద్రరావు, చింతపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు రేమల ఆనందరావు, జనసేన మండల అధ్యక్షుడు బుజ్జిబాబు, మార్కెట్ డైరెక్టర్లు సేవ ఈశ్వరమ్మ, పెద్దిరెడ్డి భేతాళుడు, చింతాడ చిన్న, తిర్నాడు, గాంధీ పాడాల్, మంగులు, మధు, రుత్తల అర్జున్ తదితర ఎన్డీఏ కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# నేడు జిల్లాకు రానున్న రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్

## - జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

నెల్లూరు జిల్లా నెల్లూరు కలెక్టరేట్(బిఎన్ఎస్ ):– ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ నేడు అనగా ఈ నెల 9వ తేదీన మంగళవారం) నెల్లూరు జిల్లాలో పర్యటించనున్నారని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా

జూన్ 9వ తేదీ ఉదయం 9.35 గంటలకు విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి హెలికాప్టర్‌లో బయలుదేరి, ఉదయం 10.50 గంటలకు నెల్లూరులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ హెలిప్యాడ్‌కు చేరుకుంటారని తెలిపారు. అనంతరం ఉదయం 11.00 గంటలకు రోడ్డు మార్గం ద్వారా బయలుదేరి, ఉదయం 11.15 గంటలకు గోలగమూడి రోడ్డులోని కనుపర్తిపాడు వద్ద ఉన్న వి.పి.ఆర్ కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకుంటారు.అనంతరం అక్కడ ఉదయం 11.30 గంటల నుండి మధ్యాహ్నం 12.40 గంటల వరకు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం 10, 11 మరియు 12వ స్నాతకోత్సవ (కాన్వొకేషన్) కార్యక్రమంలో పాల్గొంటారు.

కార్యక్రమం అనంతరం మధ్యాహ్నం 12.50 గంటలకు వి.పి.ఆర్ కన్వెన్షన్ సెంటర్ నుండి బయలుదేరి, మధ్యాహ్నం 1.05 గంటలకు నెల్లూరులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ హెలిప్యాడ్‌కు చేరుకుని. మధ్యాహ్నం 1.15 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి మధ్యాహ్నం 1.50 గంటలకు తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంటారు.అనంతరం అక్కడి నుండి మధ్యాహ్నం 2.00 గంటలకు రోడ్డు మార్గం ద్వారా బయలుదేరి మధ్యాహ్నం 2.20 గంటలకు తాజ్ తిరుపతికి చేరుకుని బస చేస్తారని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

# విధుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టండి




విజయనగరం,బిఎన్ఎస్ : ఆర్మ్డ్ రిజర్వ్ అదనపు ఎస్పీగా పి.కిరణ్ కుమార్ ఆర్మ్డ్ రిజర్వ్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టి, జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ని జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి, పూల మొక్కను అందజేయగా, జిల్లా ఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, మాట్లాడుతూ – ఆర్మ్ డ్ రిజర్వ్ పోలీసుల సంక్షేమం సెక్యూరిటీ, పరిపాన, ముఖ్య వ్యక్తుల భద్రత, కుటుంబ సంక్షేమం, ఆర్మ్ డ్ రిజర్వ్ పోలీసులు విధులను పర్యవేక్షించాలని, పరిపాలన పై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆర్మ్ డ్ రిజర్వ్ అదనపు ఎస్పీ పి.కిరణ్ కుమార్ ను ఆదేశించారు

# రైతులకు న్యాయం జరిగేలా చూస్తాం



బిఎన్ఎస్ : ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగకుండా చూడాలనే ఆలోచనతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉన్నారని, అందరికీ న్యాయం జరిగేలా చూస్తామని జిల్లా ఇంచార్జ్ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ , జిల్లా కలెక్టర్ ఎస్. రామ్ సుందర్ రెడ్డి తో కలసి మంత్రి జిందాల్ రైతులతో మాట్లాడారు. వారి సమస్యలన్నింటినీ , ప్రతి ఒక్కరి సమస్యను విని సానుకూలంగా స్పందించారు. సమస్యను ఓపెన్ గా చర్చించుకుందామని, అందరూ సహకరించాలని కోరారు. జిల్లా ఇంచార్జ్ మంత్రిగా మీ ముందుకు వచ్చానంటే ప్రభుత్వ ప్రతినిధిగానే వచ్చినట్లుగా భావించాలని, మీ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధి తో కృషి చేస్తానని అన్నారు. గతసారి రైతులతో జిందాల్ సమస్య పై చర్చించిన అంశాలను మినిట్స్ చేయడం జరిగిందని, కంపెనీ తో కూడా మాట్లాడి మీకు రావలసినవన్నీ వచ్చేలా చూస్తామని తెలిపారు .మధ్యవర్తుల మాటలు విని మీరు మోసపోవద్దని, ప్రభుత్వానికి సహకరిస్తే అందరికీ మేలు జరుగుతుందని స్పష్టం చేశారు.

# మృతుని కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



బొండపల్లి, జూన్ 8 (బిఎన్ఎస్ ): మండలంలోని వేంద్రం గ్రామానికి చెందిన సుంకర ఆదినారాయణ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆదినారాయణ కుటుంబ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ఆసుపత్రిలో అయిన ఖర్చును అందజేయాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారి దృష్టికి స్థానిక టిడిపి నాయకులు తీసుకువెళ్లారు. దీంతో స్పందించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ రావు గారు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి 41,700 రూపాయల చెక్కును మంజూరయ్యేలా చేశారు. సోమవారం చెక్కును స్థానిక టిడిపి నాయకులు చందక సతీష్ కుమార్ ఆదినారాయణ కుటుంబ సభ్యులకు అందజేశారు. కష్ట సమయంలో తమకు ఆర్థిక సహాయాన్ని అందజేసినందుకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారికి, ప్రభుత్వానికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

# గిరిజన బడికి గూడు కట్టింది గ్రామమే!

## 79 ఏళ్ల స్వాతంత్ర్యం..

## బొడ్డెంగులలో ఇంకా పాఠశాల భవనం కలగానే.

## 25 మంది విద్యార్థుల కోసం గ్రామస్తుల శ్రమదానం.

## వర్షాకాలానికి ముందే రేకుల షెడ్డు నిర్మాణం.. అధికారుల స్పందన కోసం ఎదురుచూపులు.




చింతపల్లి బిఎన్ఎస్ న్యూస్ :– దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79 ఏళ్లు పూర్తవుతున్నా, కొన్ని గిరిజన గ్రామాల్లో విద్యకు కనీస మౌలిక సదుపాయాలు ఇప్పటికీ అందుబాటులోకి రాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం తమ్మెంగుల గ్రామపంచాయతీ పరిధిలోని బొడ్డెంగుల గ్రామం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల కొనసాగుతున్నప్పటికీ, ఇప్పటి వరకు శాశ్వత భవనం నిర్మించకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పాఠశాలలో ప్రస్తుతం 25 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. ప్రతి ఏడాది వర్షాకాలం ప్రారంభమైతే చిన్నారుల చదువుకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. సరైన భవనం లేకపోవడంతో తరగతుల నిర్వహణ కష్టతరంగా మారింది. ఉపాధ్యాయుడు ఉన్నా బోధించేందుకు గది లేదు.. విద్యార్థులు ఉన్నా కూర్చొని చదువుకునే సౌకర్యం లేదు. దీంతో విద్యాభ్యాసం అనేక ఇబ్బందుల మధ్య కొనసాగుతోంది.

జూన్ 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో గ్రామస్తులు స్వయంగా ముందుకొచ్చారు. పిల్లల చదువుకు అంతరాయం కలగకూడదనే ఉద్దేశంతో సొంతంగా నిధులు సమకూర్చుకొని రేకుల షెడ్డు నిర్మాణం చేపట్టారు. గ్రామ యువకులు, పెద్దలు తమ రోజువారీ కూలి పనులను పక్కనబెట్టి శ్రమదానం చేస్తున్నారు. అడవిలో నుంచి కలప తెచ్చి, స్థానికంగా అందుబాటులో ఉన్న సామగ్రితో తాత్కాలిక పాఠశాల గూడును నిర్మిస్తున్నారు.

వర్షం కురిసిన రోజుల్లో విద్యార్థులు తడుస్తూనే పాఠాలు వినాల్సి వస్తోందని గ్రామస్తులు తెలిపారు. బురద, చలి కారణంగా పలువురు విద్యార్థులు పాఠశాలకు హాజరుకాలేకపోతుండటంతో వారి విద్య దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారుల భద్రత కూడా ప్రశ్నార్థకంగా మారుతోందన్నారు.

పాఠశాల భవనం మంజూరు చేయాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని గ్రామ పెద్దలు తెలిపారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని చెబుతున్నప్పటికీ, బొడ్డెంగుల వంటి గ్రామాల్లో కనీస విద్యా సదుపాయాలు కల్పించకపోవడం బాధాకరమన్నారు.

ప్రస్తుతం నిర్మిస్తున్న రేకుల షెడ్డు కేవలం తాత్కాలిక ఏర్పాటేనని, ఇది వర్షాకాలాన్ని దాటేందుకు మాత్రమే ఉపయోగపడుతుందని గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వెంటనే శాశ్వత పాఠశాల భవనాన్ని మంజూరు చేసి నిర్మాణం చేపట్టాలని కోరారు.

పిల్లలకు విద్య అందించడం ప్రభుత్వ బాధ్యత అని, పాఠశాలకు గూడు కట్టాల్సిన పరిస్థితి గ్రామస్తులకు రావడం విచారకరమని వారు అన్నారు. గిరిజన చిన్నారుల విద్యా హక్కును పరిరక్షించేందుకు ప్రభుత్వం తక్షణమే స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

బొడ్డెంగుల గ్రామంలో గ్రామస్తులు స్వచ్ఛందంగా నిర్మిస్తున్న రేకుల షెడ్డు ఒకవైపు వారి విద్యాపట్ల ఉన్న చిత్తశుద్ధిని చాటుతుండగా, మరోవైపు ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తోంది.

BNS BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ ఆఫ్ న్యూ భారత్



# బ్రహ్మంగారి మఠంలోని వ్యాపార సముదాయాల ముందు సిసి రోడ్డు ఏర్పాటు చేయాలి.



కడపజిల్లా (బిఎన్ఎస్) జూన్8: సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.శివకుమార్ సోమవారం ప్రముఖ పుణ్యక్షేత్రమైన బ్రహ్మంగారి మఠంలోని దేవస్థానం ముందున్న ప్రధాన వీధిలో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో పర్యటించారు.అనంతరం సిపిఎం మండల కార్యదర్శి గండి సునీల్ కుమార్ తో కలసి విలేకరులతో మాట్లాడుతూ.. మఠం అభివృద్ధిలో భాగంగా దేవస్థానం పరిధిలో అనేక సంవత్సరాలుగా ఉన్న అంగళ్లను తొలగించిన వారందరికీ నూతనంగా వ్యాపార సముదాయం కోసం స్థలాన్ని ఇవ్వడం జరిగిందని, వారందరూ తమ స్వంత డబ్బులతో అంగళ్లను నిర్మించుకున్నారని,ఆరాధన మహోత్సవాలు అయిన వెంటనే వారందరూ అందులో చేరారని అయితే పాత అంగళ్లను తొలగించిన ప్రాంతంలో పెద్ద ఎత్తున మట్టి,రాళ్ళతో అపరిశుభ్రంగా ఉందని దీనివల్ల భక్తులు యాత్రికులు అంగళ్ల దగ్గరికి వెళ్లాలంటే ఇబ్బందికరంగా తయారయిందని వారు తెలిపారు. దీనివల్ల వ్యాపారస్తులకు వ్యాపారాలు కూడా సరిగ్గా జరగటం లేదని కావున దేవస్థానం మఠాధిపతి,జోక్యం చేసుకొని అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాన్ని అంతా పరిశుభ్రం చేయించి రామాలయం దగ్గరనుండి 5,రోడ్ల సెంటర్ వరకు సమాంతరంగా సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని అదేవిధంగా వ్యాపార సముదాయాన్ని అనుకుని పార్కు కంపౌండ్ వాల్ వరకు స్టీలు గేట్లు ఏర్పాటు చేయాలి. తద్వారా వాహనాలు లోపలికి రాకుండా ఉంటాయని దేవస్థానం ప్రధాన వీధిలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి రోడ్డుమీద లేకుండా ఏర్పాటు చేయాలని. వ్యాపార సముదాయం ప్రారంభంలో ఖాళీగా ఉంచిన స్థానంలో ఉచిత మినరల్ ప్లాంట్ ఔట్ పోస్ట్ పోలీస్ స్టేషన్ ఏర్పాటుచేసి 24,గంలు అందుబాటులో పోలీస్ కానిస్టేబుల్‌ను నియమించాలని వారు డిమాండ్ చేశారు.భక్తుల,యత్రికుల భద్రతా చర్యల్లో భాగంగా మఠం పరిధిలో సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలని, ఇప్పటికే ఉన్న సీసీ కెమెరాలను అందుబాటులోకి తేవాలని వారుకోరారు. ఐదు రోడ్ల సెంటర్లో వాహనాలు అడ్డదిడ్డంగా ఉంచడం వల్ల భక్తులు యాత్రికులకే కాక వ్యాపారస్తులకు కూడా ఇబ్బందిగా ఉంటుందని అక్కడ ఒక మఠం సిబ్బందిని ఏర్పాటు చేసి వాటిని నియంత్రించాలని వారు డిమాండ్ చేశారు. ఈ పర్యటన కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు సాన గోవిందస్వామి హరి నాయకులు రాహుల్, శ్రీనువాసులు, భాస్కర్, అరవింద్, ఆంజనేయులు, శ్రీను, రమణ, వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# సమాజ నిర్మాణం లో ఆచార్యుల పాత్ర కీలకం





**బిఎన్ఎస్ న్యూస్ :**విద్యా భారతి దక్షిణ మధ్య క్షేత్ర సమితి సీబీఎస్ఈ ఆచార్య శిక్షణ శిబిరం ఎనిమిదవ రోజు కార్యక్రమాలు ఆధ్యాత్మికత, జాతీయత, సంస్కారాల సమ్మేళనంగా అత్యంత వైభవోపేతంగా సాగాయి. ప్రాతఃస్మరణ, ప్రార్థన అనంతరం జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంతో శిక్షణా యజ్ఞానికి మంగళారంభం జరిగింది.

ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన దక్షిణ మధ్య క్షేత్ర ప్రచారక్ శ్రీరామ్ భరత్ జ్యోతి ప్రజ్వలనం చేసి ఆచార్యులను ఉద్దేశించి మార్గదర్శనం చేశారు. రాష్ట్రీయ పునర్నిర్మాణంలో ఆచార్యుల పాత్ర, విద్య ద్వారా సంస్కార సంపన్న సమాజ నిర్మాణం, సేవా భావనతో కూడిన జీవన దృక్పథం వంటి అంశాలపై ఆయన చేసిన బౌద్ధిక్ ఆచార్యులను విశేషంగా ప్రేరేపించింది.

భారతీయ సంస్కృతిలో ఎనిమిది సంఖ్యకు విశిష్టమైన స్థానం ఉంది. అష్టలక్ష్మి స్వరూపాల కరుణాకటాక్షానికి ప్రతీకగా భావించబడే ఈ సంఖ్య జ్ఞానం, ఐశ్వర్యం, ఆరోగ్యం, ధైర్యం, విజయము, సేవాభావం వంటి శుభగుణాల సమన్వయాన్ని సూచిస్తుంది. అలాంటి శుభప్రదమైన అష్టమ దినాన నిర్వహించబడిన ఈ కార్యక్రమం విశేష ప్రాధాన్యతను సంతరించుకుంది.

ఈ పవిత్ర సందర్భంలో విద్యా భారతి దక్షిణ మధ్య క్షేత్ర సంఘటన కార్యదర్శి లింగం సుధాకర్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొనడం శుభసూచకంగా నిలిచింది. జ్ఞానం, విద్య, సేవ అనే త్రివేణి సంగమంగా విద్యా భారతి నిర్వహిస్తున్న ఈ శిక్షణా యజ్ఞానికి ఆయన సాన్నిధ్యం మరింత గౌరవాన్ని చేకూర్చింది. సమాజ పరివర్తనకు సంస్కారయుక్త విద్యే మూలాధారమని, ఆచార్యులే రాష్ట్రీయ పునర్నిర్మాణానికి శిల్పులని ఆయన తన సందేశంలో పేర్కొన్నారు.

విద్యా భారతి దక్షిణ మధ్య క్షేత్ర అధ్యక్షులు, ముఖ్యమంత్రి కార్యాలయ పూర్వ కార్యదర్శి డాక్టర్ చామర్తి ఉమామహేశ్వరరావు, ఐఎఎస్(రిటైర్డ్) ఈ కాలాంశకు అధ్యక్షత వహించారు.

శిబిరంలో విద్యా భారతి క్షేత్ర కోశాధికారి పసర్తి మల్లయ్య, ప్రశిక్షణ ప్రముఖ్ రావుల సూర్యనారాయణ, పూర్వ విద్యార్థి పరిషత్తు సహ సంయోజక్ రాజిరెడ్డి, నగర సహకార్యవాహ వెంకటస్వామి, స్విస్ కార్యదర్శి విశ్వేశ్వరరావు పాలుపంచుకున్నారు.

# కొడకండ్ల చలివేంద్రం విజయవంతం -- దాతల సేవలకు ప్రజల ప్రశంసలు

**బిఎన్ఎస్ న్యూస్ కొడకండ్ల, జూన్ 8**

జనగామ జిల్లా కొడకండ్ల మండల కేంద్రంలో ఫ్రెండ్లీ కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో నిర్వహించిన చలివేంద్రం కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. తీవ్ర ఎండల నేపథ్యంలో 45 రోజుల పాటు ఉచిత మంచినీరు, 35 రోజుల పాటు మజ్జిగ పంపిణీ నిర్వహించి వేలాది మంది బాటసారులు, కూలీలు, వాహనదారులు, ప్రయాణికుల దాహార్తిని తీర్చింది.చలివేంద్రం ముగింపు సందర్భంగా కడగుట్ట తండాకు చెందిన కీ.శే. మాలోతు శంకర్ గారి ఆరు నెలల జ్ఞాపకార్థంగా ఆయన సతీమణి మాలోతు పార్వతి సౌజన్యంతో సుమారు 250 మంది బాటసారులు, కూలీలు, ప్రయాణికులకు చల్లని మజ్జిగ పంపిణీ చేశారు. దీంతో 35 రోజులుగా కొనసాగిన మజ్జిగ పంపిణీ కార్యక్రమం పూర్తయింది.సుమారు రూ.70 వేల వ్యయంతో నిర్వహించిన ఈ సేవా కార్యక్రమం మండుతున్న ఎండల్లో ప్రజలకు ఎంతో ఉపశమనం కలిగించింది.బస్సు డ్రైవర్లు, కండక్టర్లు, రైతులు, కూలీలు, ప్రయాణికులు చల్లని నీరు, మజ్జిగ సేవించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.ఫ్రెండ్లీ కేర్ ఫౌండేషన్ చేపట్టిన ఈ సేవా కార్యక్రమాన్ని కొడకండ్ల ప్రజలు, యువత, పెద్దలు ప్రశంసించారు.ఈ సందర్భంగా ఫ్రెండ్లీ కేర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డా. పెదపూడి ప్రసన్న ఇటీవల బండారు దత్తాత్రేయ చేతుల మీదుగా అందుకున్న "పర్యావరణ మిత్ర జాతీయ అవార్డు"ను సంస్థకు సహకరించిన ప్రతి దాతకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమానికి కొడకండ్లతో పాటు నైజీరియా, ముంబై, సూరత్, విజయవాడ, హైదరాబాద్, హన్మకొండ, ఏడునూతుల, రంగాపురం, నర్సింగాపురం తదితర ప్రాంతాల నుంచి పలువురు దాతలు సహకరించారు.చలివేంద్రం విజయవంతం కావడానికి దోర్ణం ప్రభాకర్, దగడ్ సాయి అయ్యప్ప హోటల్ యాజమాన్యం, చెన్న ఆగయ్య, చెన్న ఉపేందర్, కొమ్ముకూరి ప్రవీణ్, బొల్లి కుమార్, బొల్లి మహేందర్, ముక్కెర శ్రీకాంత్, భూక్య నితిన్, టైలర్ ధర్మేందర్, ఆటో మహమ్మద్, వీరదాసు నవీన్, నరేందర్, భూక్య సోమ్లా, పోస్ట్ అశోక్, మేడుదుల చిన్నపెల్లి అంకిత, పెట్లోజు నాగరాజు, ముక్కెర నాగరాజు, నేతి సాయి, నింగాల




కిరణ్, మార్గం శారద, కడారి ఉపేందర్, జవ్వాజి జ్ఞానానందం, జాటోత్ భాలాజీ తదితరులు విశేష సహకారం అందించారు.అలాగే ప్రతిరోజూ చల్లని నీటి క్యాన్లు అందిస్తూ సేవలందించిన హనీ వాటర్ ప్లాంట్ నిర్వాహకులు జవ్వాజి శ్రావణ్‌కు, కార్యక్రమ నిర్వహణలో సహకరించిన డెన్ని, బెన్ని మరియు ఇతర స్వచ్ఛంద సేవకులకు ఫ్రెండ్లీ కేర్ ఫౌండేషన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. ఈ సేవా కార్యక్రమం సామాజిక బాధ్యతకు నిదర్శనంగా నిలిచిందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

# అన్నారం చెరువు కబ్జా: మట్టి నింపితే కేసులే -తహసీల్దార్ వెంకటస్వామి హెచ్చరిక

**బిఎన్ఎస్ న్యూస్ పర్వతగిరి/జూన్ 8**



వరంగల్ జిల్లా:పర్వతగిరి మండలం అన్నారం షరీఫ్ గ్రామంలో చెరువును కబ్జా చేసి, ఎఫ్‌టీఎల్ లో మట్టి పోసి ప్లాట్లు వేయాలని చూస్తున్న కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారుల వ్యవహారంపై సోమవారం పర్వతగిరి తహసీల్దార్ టి. వెంకటస్వామి తన సిబ్బందితో కలిసి చెరువు ప్రాంతాన్ని సందర్శించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఎవరైనా మట్టి నింపితే వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎఫ్‌టీఎల్‌లో మట్టి పోసిన వారికి నోటీసులు జారీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు.ప్రభుత్వం దళితులకు కేటాయించిన భూమిని ఎవరైనా ఆక్రమించే ప్రయత్నం చేస్తే వారిపై కూడా కేసు నమోదు చేస్తామని తహసీల్దార్ స్పష్టం చేశారు.

## చింత నెక్కొండ గ్రామపంచాయతీలో గ్రామసభ నిర్వహించిన

# గ్రామ సర్పంచ్ గాడుదుల రమేష్ యాదవ్




**బిఎన్ఎస్ న్యూస్, పర్వతగిరి / జూన్ 8 :**

పర్వతగిరి మండలంలోని చింత నెక్కొండ గ్రామపంచాయతీలో గ్రామసభ గ్రామ సర్పంచ్ గాడుదుల రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో గ్రామసభ ఏర్పాటు చేయడం జరిగింది.గ్రామ సర్పంచ్ గాడుదుల రమేష్ యాదవ్ మాట్లాడుతూ..పర్యావరణ పరిరక్షణలో భాగంగా గ్రామ ప్రజలు తడి పొడి చెత్తను వేరుచేసి గ్రీన్- బ్లూ బకెట్లలోనే వెయ్యాలని తద్వారా అనారోగ్య సమస్యల బారిన పడకుండా ఉంటారని అన్నారు.అలాగే గ్రామంలోని పలు సమస్యలపై మాట్లాడుతూ నీటి సమస్య,కరెంటు సమస్య,రోడ్లపై చెత్త లేకుండా సిబ్బందితో పనులు చేపిస్తానని అన్నారు.అలాగే మన గవర్నమెంట్ పాఠశాలలోనే పిల్లలను చేర్పించి పాఠశాల యాజమాన్యానికి సహకరించి ఉన్నత విద్యను తమ పిల్లలకు అందించాలని గ్రామ ప్రజలకు తెలియజేశారు.ఈ గ్రామసభ సమావేశానికి గ్రామపంచాయతీ సెక్రటరీ,ఉప సర్పంచ్,వార్డ్ మెంబర్లు,గ్రామ పార్టీ అధ్యక్షులు,వెటర్నరీ హాస్పిటల్ డాక్టర్,హార్టికల్చర్ ఆఫీసర్,జి పి ఓ సార్,హై స్కూల్ హెడ్మాస్టర్స్,గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు,నాయకులు పాల్గొన్నారు.

# గోపాల్‌పూర్‌లో పేదల ఇండ్ల కూల్చివేత దారుణం

## కలెక్టరేట్ ను ముట్టడించిన బాధితులు,సీపీఎం నేతలు

**బిఎన్ఎస్ న్యూస్ హనుమకొండ**

హనుమకొండ జిల్లా గోపాల్‌పూర్ పరిధిలో పేద ప్రజలు నిర్మించుకుని నివాసముంటున్న ఇండ్లను,గుడిసెలను జిల్లా అధికార యంత్రాంగం ముందస్తు సమాచారం లేకుండా నిర్దాక్షిణ్యంగా కూల్చివేయడంపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి.ఇండ్ల కూల్చివేతకు నిరసనగా సోమవారం బాధితులు, సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు భారీ ధర్నా, నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కమిటీ నాయకులు మాట్లాడుతూ.. దశాబ్దాలుగా నిలువ నీడ లేక, రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేదలు గోపాల్‌పూర్ ప్రాంతంలో చిన్న చిన్న ఇండ్లు, గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారని తెలిపారు.




అలాంటి పేదలకు ప్రత్యామ్నాయ వసతి కల్పించకుండా, మానవత్వం లేకుండా జిల్లా యంత్రాంగం జేసీబీలతో ఇండ్లను కూల్చివేసి వారిని రోడ్డున పడేయడం అత్యంత దారుణమని మండిపడ్డారు. వర్షాకాలం ప్రారంభమవుతున్న తరుణంలో తలదాచుకునేందుకు నీడ లేక చిన్న పిల్లలు, వృద్ధులతో పేద ప్రజలు నడిరోడ్డుపై అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారినా పేదల బతుకులు మారడం లేదని, 'ప్రజా పాలన' అని చెప్పుకుంటున్న ప్రభుత్వం పేదల పొట్టకొట్టడం సరికాదని ధ్వజమెత్తారు.కూల్చివేతలతో సర్వస్వం కోల్పోయిన బాధితులందరికీ ప్రభుత్వం తక్షణమే న్యాయం చేయాలని, గతంలో నిర్మించిన డబుల్ బెడ్రూమ్ ఇళ్లను గానీ, లేదా నూతనంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ఇండ్లను గానీ కేటాయించి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్‌కు సమర్పించారు. పేదలకు ఇండ్ల స్థలాలు ఇచ్చి, ఇండ్లు నిర్మించి ఇచ్చేంతవరకు సీపీఎం ఆధ్వర్యంలో బాధితులతో కలిసి పోరాటాన్ని ఉధృతం చేస్తామని,అవసరమైతే కలెక్టరేట్ ముందే వంటావార్పు చేసి నిరసన తెలుపుతామని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో సీపీఎం మండల ముఖ్య నాయకులు రమేష్, సబిత, సమ్మయ్య, మమత, శృతి, పావని, యాకమ్మలతో పాటు కూల్చివేత బాధితులు, మహిళలు,పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని జిల్లా యంత్రాంగం వైఖరికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

# రుద్రారంలో 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' గ్రామసభ

## క్షేత్రస్థాయిలోనే సమస్యల పరిష్కారానికి అధికారుల ప్రత్యేక చొరవ:కలెక్టర్ రాహుల్ శర్మ



**బిఎన్ఎస్ న్యూస్ భూపాలపల్లి మల్హర్:**

గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను క్షేత్రస్థాయిలోనే సమర్థవంతంగా పరిష్కరించేందుకు 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' గ్రామసభలు ఒక అద్భుతమైన వేదికగా నిలుస్తాయని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. సోమవారం మల్హర్ మండలం రుద్రారం గ్రామంలో 99 రోజుల ప్రణాళికా కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన మహా గ్రామసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, సంబంధిత ప్రభుత్వ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ.. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 4, 6, 8, 10 తేదీలలో జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా గ్రామసభలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి సభలోనూ అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు విధిగా పాల్గొని, తమ తమ శాఖల ద్వారా క్షేత్రస్థాయిలో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలు, ప్రజలకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ సేవలపై సమగ్రంగా అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సభల ముఖ్య ఉద్దేశం గ్రామస్థుల సమస్యలను నేరుగా, పారదర్శకంగా తెలుసుకొని వాటిని త్వరితగతిన పరిష్కరించడమేనని స్పష్టం చేశారు. ఎస్.ఐ.ఆర్ నమోదు ప్రక్రియతో పాటు ఈ ఏడాది ఏర్పడనున్న ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వర్షాభావ పరిస్థితులను తట్టుకునేలా రైతాంగం పంటల సేద్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వ్యవసాయ అధికారులు రైతులకు వివరిస్తున్నారన్నారు.వీటితో పాటు గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, కాలుష్య నియంత్రణ, మిషన్ భగీరథ సురక్షిత తాగునీటి సరఫరా తదితర ప్రజా ఆరోగ్య రక్షణ అంశాలపై ప్రజలను చైతన్యపరుస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. నేటి రుద్రారం గ్రామసభలో స్థానిక రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకాలకు సంబంధించిన రెవెన్యూ సమస్యలు, అంతర్గత రహదారులు, మురుగు కాలువల (డ్రైనేజీ) నిర్మాణం తదితర మౌలిక వసతులపై తమకు పెద్ద సంఖ్యలో వినతిపత్రాలు సమర్పించారని ఆయన వెల్లడించారు. గ్రామస్థుల నుండి అందిన ప్రతి వినతిని సంబంధిత శాఖల అధికారుల ద్వారా వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలింపజేసి, నిర్దిష్ట కాలపరిమితిలో సమస్యల శాశ్వత పరిష్కారానికి ఖచ్చితమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రాహుల్ శర్మ ప్రజలకు బలమైన హామీ ఇచ్చారు. ఈ ప్రజా ప్రాధాన్యత కలిగిన గ్రామసభలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్



విజయలక్ష్మి, మల్హర్ మండల ప్రత్యేక అధికారి జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావు, రెవెన్యూ డివిజనల్ అధికారి రవీందర్, తహసీల్దార్ రవికుమార్, స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి , ఐసీడీఎస్ సీడీపీఓ రాధిక, వివిధ శాఖల ప్రజాప్రతినిధులు, అధికారులు, రుద్రారం గ్రామ ప్రజలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేశారు.

# ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య: పిల్లలను చేర్పించండి-ఎంఈఓ పిలుపు

## పర్వతగిరి మండలంలో పాఠ్యపుస్తకాల పంపిణీ ప్రారంభం

**బిఎన్ఎస్ న్యూస్ పర్వతగిరి/జూన్ 8**




వరంగల్ జిల్లా:పర్వతగిరి మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు అందించినట్లు మండల విద్యాశాఖాధికారి ఏ.బిక్షపతి తెలిపారు.పర్వతగిరి మండల విద్యా వనరుల కేంద్రంలో నిర్వహించిన ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,పాఠశాలల పునఃప్రారంభ తేదీకి ముందే అన్ని పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు సిద్ధంగా ఉంచామని తెలిపారు. విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు,నోట్ బుక్స్, వర్క్ బుక్స్,యూనిఫాం,మధ్యాహ్న భోజనం అందిస్తోందని అన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య అందుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు,ఎంఆర్సి సిబ్బంది శిల్ప,జయరాజ్,సీఆర్పీలు ప్రవీణ్,సుధ,శ్రీనివాస్,లోకేష్ తదితరులు పాల్గొన్నారు.